క్లుప్తంగా

నేడు అన్నోజిగూడకు ఎమ్మెల్యే సబితారెడ్డి రాక

కందుకూరు: మండల పరిధిలోని అన్నోజిగూడలో అభివృద్ధి పనులను ప్రారంభించడానికి ఎమ్మెల్యే సబితారెడ్డి రానున్నారని జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటలకు నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనానికి ప్రారంభోత్సవం, అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. దీనికి ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



బెనర్జిని సన్మానిస్తున్న ఎలక్ట్రికల్ కాంట్రాక్ట్ ఉద్యోగులు

బడంగ్‌పేట్: తెలంగాణ బి గ్రేడ్ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ అసోసియేషన్ డైరీ, క్యాలెండర్‌ను సంఘం నాయకులు ఆదివారం ఆవిష్కరించారు. తెలంగాణ లైసెన్స్ బోర్డు మెంబర్‌గా నేమాల బెనర్జిని వారు ఏర్పాటు చేసుకున్న సమావేశంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ ఉద్యోగులు బెనర్జిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి, రఘు, సయ్యద్ పాషా, మల్లేష్‌యాదవ్, ఉదయభాస్కర్, బాల్‌రెడ్డి, శ్రీనివాస్, గోవర్దన్, తదితరులు పాల్గొన్నారు.

సత్యం హోమియోపతి నేడు ప్రారంభం

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ లక్ష్మీ వైట్ హౌస్ ప్రాంగణంలో ఆసుపత్రి 3వ బ్రాంచిని సోమవారం ప్రారంభిస్తున్నట్లు సంస్థ చైర్మన్ గుజ్జ సత్యనారాయణ తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హోమియోపతి అందరికీ అందుబాటులో ఉండాలన్న లక్ష్యంతో ఐదు సంవత్సరాల క్రితం మొదటి బ్రాంచి ప్రారంభించామని గుర్తుచేశారు. నూతన బ్రాంచి ప్రారంభోత్సవం సందర్భంగా నెలపాటు అందరికీ ఉచిత కన్సోలేషన్, మందుల సౌకర్యం కలిగిస్తున్నామని తెలిపారు. ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇతర వివరాలకు ఫోన్ నెం-9121218585లో సంప్రదించాలని సూచించారు.

వార్షికోత్సవ వేడుకలు అదుర్స్



వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

బడంగ్‌పేట్: సెంట్ జోసెఫ్ డిగ్రీ మరియు పీజీ కాలేజీ కింగ్ కోఠీ ఆధ్వర్యంలో 44వ వార్షికోత్సవ వేడుకలను అలూమ్ని పేరుతో మిలాన్-2024 ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను ప్రిన్సిపాల్ ఫాదర్ అంటోని ప్రారంభించగా ముఖ్య అతిథిగా పాధర్ డాక్టర్ వికే స్వామి, రవి కన్రు, స్కిప్పి సీఈవో డియాన్ అంటోని తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన నృత్యాలు చూపరులను అలరించాయి.

ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి

తుక్కుగూడ: అయోధ్యలోని రామమందిరంలో సోమవారం సీతారాముల ప్రతిష్ఠాపన సందర్భంగా ఆ వేడుకలను ఇక్కడ నిర్వహించడానికి మున్సిపాలిటీ పరిధిలోని ఆయా గ్రామాల్లోని పలు ఆలయాలను ఆదివారం సిద్ధం చేశారు. ఆలయాల శుద్ధితో పాటు, ప్రత్యేకలంకరణ చేశారు. ఇంటింటా శ్రీరాముని చిత్రాలను, జెండాలను పంచారు. అయోధ్యలో జరిగే ప్రాణప్రతిష్ఠను వీక్షించడం కోసం ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేస్తున్నారు.

ఓటరు జాబితాలో తప్పులు సరిచేసుకోండి



విశ్వనాథ్‌పూర్‌లో ఓటరు నమోదు కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు

కొందుర్గు: ఓటరు జాబితాలో ఏమైన తప్పులు ఉంటే సరిచేసుకోవాలని తహసీల్దార్ రమేష్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం అన్ని గ్రామాల్లో ప్రత్యేక ఓటరు నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా బూత్ లెవల్ అధికారులు గ్రామాల్లో అందుబాటులో ఉండి కొత్త ఓటరు దరఖాస్తు, పేరు మార్పు తదితర దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా రమేష్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన ఆసూచించారు.

ఏదీ చెత్త శుద్ధి?

- సోలిపూర్ శివారులో డంపింగ్
- తప్పని తిప్పలు
- కనిపించని పరిశుభ్రత
- రోగాల బారిన జనం
- పట్టించుకోని అధికారులు



సోలిపూర్‌లో పేరుకుపోయిన చెత్త

షాద్‌నగర్: ప్రతీ ఇంటి నుంచి సేకరించిన చెత్తను ఆ ఊరి చివరే పడేస్తున్నారు. ఫలితంగా ఆ గ్రామస్థుల తిప్పలు వర్ణనాతీతం. నిత్యం యార్డు నుంచి వెలువడే దుర్వాసనతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. చెత్తను కాల్చడం వల్ల ఎగిసి పడుతున్న మంటల వల్ల వెలువడే పొగతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు.

ఇదీ పరిస్థితి..

షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో 28వార్డులు, సుమారు 20వేల ఇళ్లు ఉన్నాయి. పట్టణ జనాభా సుమారు లక్షకు పైమాటే. ప్రతీరోజు మున్సిపల్ సిబ్బంది సుమారు 32మెట్రిక్ టన్నుల తడి, పొడి చెత్త సేకరిస్తున్నారు. ఇందులో సుమారు 400 కిలోల వరకు కూరగాయల వ్యర్థాలే ఉంటున్నాయి. చెత్త సేకరణకు అధికారులు ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేశారు. పారిశుద్ధ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరిస్తున్నారు. పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు సుమారు 115మంది విధుల్లో ఉన్నారు.

చెత్తపై ఏది సమరం..

చెత్తను సద్వినియోగ పరిస్తే అందరికీ ఉపయోగపడుతుంది. చెత్తను రీ సైక్లింగ్ చేద్దాం, రీ యూస్ చేద్దాం, చెత్తపై సమరం సాగిద్దాం, చెత్త రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దుదాం.. అనే మాటలు మూటలుగానే మారుతుంది.

- ఇళ్లలో సేకరించిన చెత్త మున్సిపాలిటీ పరిధిలో సోలిపూర్ గ్రామ శివారులో వేస్తుండడంతో ఈగలు, దోమలు విపరీతంగా చేరి గ్రామస్థులను రోగాల బారిన పడేస్తున్నాయి. గ్రామ శివారులో చెత్త వేయొద్దని స్థానికులు, గ్రామస్థులు ఏళ్లుగా వేడుకొంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.
- ఇదీ దుస్థితి
- చెత్తను తరుచుగా తగుల బెడుతుండడంతో డంపింగ్ యార్డు రావణ కాష్టంలా నిత్యం మండుతూనే ఉంటుంది.
- గుట్టలు, గుట్టలుగా పేరుకపోయిన చెత్తలో ప్లాస్టిక్ వ్యర్థాలు, ఆసుపత్రి వ్యర్థాలు సైతం ఉంటున్నాయి.
- చెత్తను సిబ్బందే తగులబెడుతున్నారా? లేక ఏదైనా రసాయన చర్యల వల్ల మండుతుందో అనేది తెలియడం లేదు.
- అసలే దుర్వాసన ఆపై ఘాటైన పొగతో ప్రజలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు.
- నత్తనడకన పనులు..
- షాద్‌నగర్ మున్సిపాలిటీ రోజుకు రోజుకు విస్తరిస్తూనే ఉంది. చెత్తను ఒక చోట వేసేందుకు పట్టణ శివారులోని సీఎస్‌కే వెంచర్ వెనుక భాగంలోని ప్రభుత్వ భూమిలో డంపింగ్ యార్డు నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. మున్సిపల్ నిధుల నుంచి సుమారు రూ.12లక్షలతో చేపడుతున్న డంపింగ్ యార్డు పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. అయితే పట్టణంలో సేకరించిన చెత్తను ప్రస్తుతం మున్సిపాలిటీ పరిధిలోని సోలిపూర్ గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిలో పారబోస్తున్నారు.

ఆసుపత్రుల పాలవుతున్నాం..



సోలిపూర్ గ్రామ శివారులో చెత్త వేయడం వలన గ్రామంలో విపరీతంగా ఈగలు, దోమలు వ్యాపిస్తున్నాయి. దీంతో చాలా మంది రోగాల బారిన పడి ఆసుపత్రుల పాలవుతున్నారు.

– జాకారం నర్సింలు, సోలిపూర్

పొగతో అవస్థలు పడుతున్నాం..



చెత్తను కుప్పలుగా పోసి తగులబెడుతున్నారు. దీంతో దట్టమైన పొగ కమ్ముకుంటుంది. ఈ పొగతో ఊపిరి ఆడటం లేదు. దుర్వాసన వెదజల్లుతుంది.

– సింగపాగ శ్రీశైలం, సోలిపూర్

చర్యలు తీసుకోవాలి



గ్రామ శివారులోని డంపింగ్ యార్డును తరలించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలి. ఎన్నో ఏళ్లుగా గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నా ఎవరు పట్టించుకోవడం లేదు. తద్వార తాము అవస్థలు పడుతున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– మారుతీ, సోలిపూర్

భువనశ్రీకి కరాటేలో కాంస్య పతకం



కాంస్య పతకంతో భువనశ్రీ

కందుకూరు: మండల పరిధిలోని సార్లారావులపల్లి సర్పంచ్ జర్పుల రజితప్రవీణ్‌నాయక్ కుమార్తె జర్పుల భువనశ్రీ సౌత్ జోన్ ఖేలో ఇండియా ఉమెన్స్ కరాటే లీగ్‌లో కాంస్య పతకం సాధించింది. తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూర్‌లో ఈ నెల 18న నిర్వహించిన సౌత్ జోన్ ఖేలో ఇండియా నిర్వహించిన కరాటే పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీల్లో భువనశ్రీ మూడో స్థానంలో నిలిచింది. ప్రస్తుతం ఆ విద్యార్థిని హైదరాబాద్ హస్తినాపురంలోని శ్రీభవిష్య ఇంటర్నేషనల్ స్కూల్‌లో మూడో తరగతి చదువుతుంది. అక్కడే ట్రైనర్ సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతుంది.

మాజీ ఆర్మీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాజీ ఆర్మీ ఉద్యోగులు

బడంగ్‌పేట్: బడంగ్‌పేటలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మాజీ ఆర్మీఉద్యోగులు ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. గతంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి సంక్షేమ సంఘానికి స్థలం కేటాయించి భవనం నిర్మిస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని వారు గుర్తు చేశారు. ఈ హామీని ఎమ్మెల్యే నిలబెట్టుకోవాలని వారు కోరారు. వీటితో పాటు ఎక్స్ సీపీఎఫ్ వెల్ఫేర్ బోర్డు స్థాపించడానికి కొత్త ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని వారు పేర్కొన్నారు. దీనికోసం సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం ఇవ్వనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కె.శ్యామ్‌సుందర్‌రెడ్డి, ముఖ్య సలహాదారుడు ఎస్ ఎన్‌రెడ్డి, రాజరత్నం, యాదగిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణ



అన్నప్రసాద వితరణలో చెన్నకిషన్‌రెడ్డి

కందుకూరు: అన్నం పరబ్రహ్మ స్వరూపమని లయన్స్‌క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ గంగాపురం చెన్నకిషన్ రెడ్డి అన్నారు. కందుకూరు లయన్స్‌క్లబ్ మరియు ఆమన్‌గల్లు లయన్స్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం కందుకూరులో మీల్స్ ఆన్ వీల్స్ వాహనం ద్వారా అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ సందర్భంగా గంగాపురం చెన్నకిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఆకలితో ఉన్న వ్యక్తికి ఆహారం అందించడం కన్న గొప్ప సేవ మరొకటి లేదన్నారు. కందుకూరు చౌరస్తాలో వరుసగా రెండోసారి అన్నప్రసాద వితరణ చేపట్టామన్నారు. లయన్స్‌క్లబ్ జిల్లా వైస్ గవర్నర్ డాక్టర్ జి.మహేందర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ లయన్స్ ఇంటర్నేషనల్ గుర్తించిన గ్లోబల్ కార్యక్రమాల్లో ఆకలి నిర్మూలన కూడా ఒక కార్యక్రమమన్నారు. అందుకోసం మీల్స్ ఆన్ వీల్స్ వాహనాలను సమకూర్చుకుని జిల్లా మొత్తంలో భారీ ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. కల్వకుర్తికి చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ దామోదర్‌రెడ్డి తన తండ్రి స్వర్గీయ వీరెడ్డి బుచ్చిరెడ్డి జ్ఞాపకార్థం నేటి కార్యక్రమానికి చేయూతనందించారన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ మండల అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి, కార్యదర్శి కె.వెంకటేశ్వర్లుగుప్తా, సురసాని సుధాకర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, జూలూరి రమేష్, బిచ్యానాయక్, వెంకటేష్, రాజు, జె.లక్ష్మయ్య పాల్గొన్నారు.

డాక్టర్ సంధ్యకు ఘన సన్మానం



షాద్‌నగర్: స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకొని నవభారతి నిర్మాణ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన వారికి పురస్కారాలను అందజేశారు. వైద్య రంగంలో సేవలు అందిస్తున్న పట్టణంలోని ఎస్ఎస్ దంత వైద్యశాల డాక్టర్ సంధ్యకు సేవా పురస్కార్‌ను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సంధ్యను పీవీఆర్ ట్రస్టు చైర్మన్ పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శివలింగం, నర్సింహ్మ యాదవ్, నరేందర్‌రెడ్డి, అల్వాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల సభను విజయవంతం చేయాలి



ఉద్యమకారుల వాల్ పోస్టరును ఆవిష్కరిస్తున్న భీంభరత్

షాబాద్: ఉద్యమకారుల కృతజ్ఞత మహాసభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి పామెన భీంభరత్ పేర్కొన్నారు. ఆదివారం షాబాద్‌లో ఉద్యమకారుల ఫోరం పార్లమెంట్ ఇన్‌చార్జి యాలాల మహేశ్వర్‌రెడ్డి, షాబాద్ మండల ఉద్యమకారుల ఫోరం అధ్యక్షుడు కుమ్మరి చెన్నయ్యలతో కలిసి వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 4వ తేదీన చేవెళ్లలో నిర్వహించనున్న ఉద్యమకారుల కృతజ్ఞత సభను విజయవంతం చేయాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ఇన్‌చార్జి ఈదులపల్లి రాములు, మహేందర్‌గౌడ్, డీసీసీ ఉపాధ్యక్షుడు ఆగిరెడ్డి, ఉద్యమకారుల ఫోరం షాబాద్, మొయినాబాద్, చేవెళ్ల మండలాల అధ్యక్షులు కుమ్మరి చెన్నయ్య, మహిపాల్, టీజేఎస్ చేవెళ్ల నియోజకవర్గం యూత్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, శివకుమార్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మల్లురవికి శుభాకాంక్షల వెల్లువ

షాద్‌నగర్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులుగా మాజీ పార్లమెంట్ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే మల్లురవి నియామకంపట్ల ఆదివారం పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తాండ్రకాశీనాథ్‌రెడ్డి మల్లురవికి శాలువా కప్పి, బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మల్లురవి మాట్లాడుతూ కాంగ్రెస్‌లో కష్టపడి పని చేసిన వారికి తప్పనిసరిగా గుర్తింపు లభిస్తుందన్నారు.

దేవాలయంలో ప్రత్యేక పూజలు

షాద్‌నగర్: పట్టణ శివారులోని చౌడమ్మగుట్ట హనుమాన్ దేవాలయంలో ఆదివారం కాంగ్రెస్ సీడబ్ల్యూసీ సభ్యుడు వంశీచంద్‌రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలోని శ్రీకృష్ణ గోశాలలో గోవులకు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, పురుషోత్తంరెడ్డి, సీతారాం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ పనులు వేగంగా చేయండి



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

ఎమ్మెల్యే సబితారెడ్డి

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ కార్యాలయ భవన నిర్మాణ పనులను వేగంగా చేయాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆదేశించారు. మిథులానగర్‌లో రూ.2 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న కార్పొరేషన్ భవనాన్ని ఎమ్మెల్యే ఆదివారం ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. అనంతరం సబితారెడ్డి మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండేలా సకల సౌకర్యాలతో ఈ భవనాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. త్వరితగతిన పనులను పూర్తి చేసి అందుబాటులోకి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ ఎం.దుర్గాదీప్ లాల్ చౌహాన్, కార్పొరేటర్లు అర్కల భూపాల్‌రెడ్డి, సిద్ధాల లావణ్య, బీఆర్ఎస్ మీర్‌పేట అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ..

జిల్లెలగూడ 16వ డివిజన్ పాష్‌కాలనీలోని ఉప్పరి సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఎనుగుల అనిల్‌యాదవ్, కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయ డైరెక్టర్ మేకల యాదగిరి, నాయకులు చల్ల సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం పెంపొందుతుంది

మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్



బహుమతులు ప్రదానం చేస్తున్న కేఎల్ఆర్

కందుకూరు: క్రీడలతో మానసికోల్లాసం పెంపొందుతుందని మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని నేదునూరులో ఐ రాకేష్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ లీగ్ విజేతలకు ఆదివారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కేఎల్ఆర్ మాట్లాడారు. గెలుపోటములు సహజమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తే నైపుణ్యం ఉన్న క్రీడాకారులు వెలుగులోకి వస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి, సరికొండ మల్లేశ్, సీనియర్ నాయకులు జి.ప్రభాకర్‌రెడ్డి, జి.రాములుగౌడ్, అందుగుల సత్యనారాయణ, సరికొండ జగన్, ఎండీ మోహీన్, మర్ల రాములుయాదవ్, దేవరకొండ రాములు, నీరటి నాగరాజు, వరికుప్పల బాబు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



కేఎల్ఆర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్ఎస్ నాయకులు

కందుకూరు: బీఆర్ఎస్‌కి చెందిన పలువురు నాయకులు ఆదివారం మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ సమక్షంలో పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి, సీనియర్ నాయకుడు అందుగుల సత్యనారాయణ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో కొత్తూరుకు చెందిన బీఆర్ఎస్ మండల మాజీ యూత్ అధ్యక్షుడు సత్తార్ రవికుమార్‌రెడ్డితో పాటు తోకల ధనుంజయ, కర్నాటి కుమార్, తోకల సునీల్, కర్నాటి శ్రీనివాస్, దయ్యాల నర్సింహ, తోకల వీరేశ్, పి.శ్రీకాంత్, డి సురేశ్, ఈ సురేశ్, సైదులు, రవితేజ, మణిరత్నం, మాధవరెడ్డిలకు కేఎల్ఆర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కేఎల్ఆర్ సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అందుగుల సత్యనారాయణ, మేరుగు నిరంజన్, మధన్‌పాల్‌రెడ్డి, జగదీశ్, క్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ కెప్టెన్ త్రిషాపూజితకు సన్మానం



త్రిషా పూజితను సన్మానిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

హుడాకాంప్లెక్స్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఉమెన్ అండర్-23 క్రికెట్ కెప్టెన్ త్రిషా పూజితను తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తన నివాసంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తపేటకు చెందిన త్రిషా పూజిత రాష్ట్రం నుంచి డబ్ల్యూపీఎల్‌లో గుజరాత్ జైంట్స్ టీమ్‌కి ఎంపిక కావడం సంతోషంగా ఉందని తెలిపారు. రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించటం అనేది చాలా గర్వించదగిన విషయమన్నారు. జాతీయ స్థాయిలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకోవాలని, ఇందుకు తనవంతు సహకారం అందిస్తానని అన్నారు. త్రిషా పూజితకు క్రికెట్‌లో తర్ఫీదు ఇచ్చిన శ్రీనివాస్, చాముండేశ్వరినాథ్, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ క్రికెట్ కోచ్ రాజశేఖర్‌రెడ్డిలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

సనాతన ధర్మాన్ని కాపాడుకుందాం



మొయినాబాద్ రూరల్: సనాతన ధర్మాన్ని హిందువులందరు కాపాడుకున్నప్పుడే భక్తిభావంతో పాటు క్రమశిక్షణ అలవడుతుందని రక్త మైసమ్మ దేవాలయ పూజారి అంజనిశాస్త్రీ, అయోధ్య కరసేవకుడు రవీందర్‌చారిలు పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని రక్తమైసమ్మ దేవాలయంలో ఆస్ట్రేలియాలో ఉద్యోగం చేస్తు హనుమాన్ చాలీసా వెయ్యి పుస్తకాలను వడ్ల మధుసుదనచారి పంపించడంతో వాటిని భక్తులకు వారు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అమ్డాపూర్ రక్తమైసమ్మ ఆలయ నిర్మాణ కర్త బండ్లగూడ అర్జున్‌గౌడ్, విశ్వకర్మ జిల్లా ఉపాధ్యక్షుడు వడ్ల నర్సింహ్మాచారి, మధుసుదన్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి, సుమంత్‌రెడ్డి, హిమాయత్‌నగర్ జెల్లాల మల్లేష్‌యాదవ్, చంద్రపాల్‌రెడ్డి, వినోద్, భానుచందర్, భానుతేజ, నందీశ్వర్‌చారి, మణిదీపక్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.